INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:9, ISSUE:12(6), December:2020

# తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు– జీవన విధానం

**డా. ఎమ్. రమేశ్ బాబు**

అసోసియేట్ ప్రొఫెసర్ – తెలుగు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల , కూకట్ పల్లి

హైదరాబాద్, తెలంగాణ

జాతి ప్రత్యేక అస్తిత్వాన్ని ప్రకటించేది సంస్కృతి. ఉన్నత జీవితం గడపడానికి భౌతికంగా, మానసికంగా, చేసే నిరంతర ప్రయత్నాలు దీనికి మూలాలు కనుక వ్యవస్థ, రాజ్యం, మతం, విజ్ఞానం, కళ లు, వస్తుజాలం, పండుగలు, జాతరలు, వేషభాషలు, పోరాటాలు అన్నీ సంస్కృతి గురించి తెలియజేసేవి. తెలంగాణా సంస్కృతి అంటే కొన్ని వేల సంవత్సరాల చరిత్ర, నాగరికత, ఆర్థిక విషయాలు, రాజకీయ వ్యవస్థ అని తెలుస్తుంది. 2014వ సంవత్సరం ఎన్నికల్లో తెలంగాణా రాష్ట్ర సమితి మెజారిటి స్థానాలు సాధి ంచి తెలంగాణా రాష్ట్రపు తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. తెరాస అధ్యక్షుడు కె. చంద్రశేఖర్రావు గారు 2014 జూన్ 2న తెలంగాణా తొలి ముఖ్యమంత్రిగా పదవిని చేపట్టారు. తెలంగాణా ఆంధ్రరాష్ట్రంలో కలసి ఉన్నప్పుడు 10జిల్లాలుగా ఉండేది. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత 31జిల్లాలుగా అభివృద్ధి చెందింది తెలంగాణా రాష్ట్రం, కాబట్టి తెలంగాణాలోని సంస్కృతి, సాంప్రదాయాలు అక్కడి జీవన విధానం గురించి తెలుసుకోవాలి.

**1. భాష**: తెలంగాణా రాష్ట్రంలో అధిక సంఖ్యాకుల భాష తెలుగు. సంపూర్ణ తెలంగాణా వారు మాట్లాడే తెలుగు భాషలో ఉర్దూ పదాలు ఎక్కువగా కనిపిస్తాయి. అదిలాబాదు జిల్లాకు మూడు వైపులా మహారాష్ట్ర సరిహద్దుగా ఉండడంతో ఆ జిల్లాలో మరాఠి భాష ప్రభావం కొంత ఉంది.

మహబూబ్ నగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాలు కర్ణాటక సరిహద్దు గ్రామాలలో కన్నడ భాష ప్రభావం కొంత వరకు కనిపిస్తుంది. తెలంగాణా ప్రాంతపు గ్రామీణ తెలుగు భాషయాసలో మిగతా ప్రాంతం తెలుగు భాషకు కొద్దిగా వైరుధ్యం కనిపిస్తుంది. తెలంగాణాలోని ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో కొద్దిగా స్వచ్ఛమైన తెలుగు వినిపి స్తుంది.

**2. వస్త్రధారణ**: తెలంగాణా ప్రాంతం ఉత్తర, దక్షిణ భారతదేశానికి వారధిగా ఉడడం మరియు కొన్ని శతాబ్దాల నుంచి ఈ ప్రాంతంపై దండయాత్రలు చేసి పాలించడం, ఇతర ప్రాంతాల వారు వచ్చి నివాసం ఏర్పరచుకోవడంతో ఇక్కడ మిశ్రమ వస్త్రధారణ ఉంది. అలాగే మారుతున్న ధోరణులు, సినిమా, అంతర్జాలం, అంతర్జాతీయీకరణ తదితరాల వల్ల కూడా ఇక్కడి వస్త్రధారణ పట్టణ ప్రాంతాలలో చాలా మార్పు చెందింది. అయినా తెలంగాణా గ్రామీణ ప్రాంతాలలో పురుషులు మోకాళ్లపైకి ఉండే ధోవతి, మహిళలు చీరలు ధరించడం సాధారణంగా కనిపిస్తుంది. గిరిజన ప్రాంతాల మహిళలు మాత్రం వారి సాంప్రదాయక దుస్తులు ధరిస్తారు. లంబాడీలు ఎక్కువ గాజులు, పెద్దపెద్ద కమ్మలు, ముక్కుపుడక, తలమీద పైట, పెద్ద కడియాలు ధరిస్తారు. ఒక్కో ప్రాంతంలో వారి సాంప్రదాయానికి తగిన విధంగా దుస్తు లను ధరిస్తారు.

**3. కులవృత్తులు**: తెలంగాణా ఉపరితలంలోని ఆవాసయోగ్యత వలన లోహయుగం నాటికే ఇక్కడ మానవజీవన వికాసం పరిపక్వత చెందింది. వ్యవసాయ పనిముట్లు, ఇనుపవస్తువులు, మట్టి పాత్రల తయారీలో శాతవాహనులకు పూర్వమే అద్భుతమైన నాగరికతను సాధించినట్టు పెద్దబొంకూరు పట్టణ నాగరికతలోని శాస్త్రీయత తెలుపుతుంది. చేనేత, కంచరం, కమ్మరం, కుమ్మరం, వడ్రంగం, శిల్పులు, తెలికులు, చర్మకారులు మేదరులు, బుకు, మెరుగుపెట్టువారు మొ॥ సమస్త కులాలు

తమ వృత్తిలో గొప్ప నైపుణ్యాన్ని, శాస్త్రీయతను సాధించారు. తెలంగాణా ఇనుము-ఉక్కు పరిశ్రమ, వస్త్రాలు, కుండలు అప్పటికే ప్రపంచ ప్రసిద్ధి చెందాయి.

వివిధ కులాల ప్రజలు వ్యాపారంలోకి ప్రవేశించి వివిధ ప్రాంతాలు తిరగడం చేత వృత్తి నిపుణత మరెంత పెరిగింది. సన్నపు బట్టలు అంతర్జాతీయ ఖ్యాతి గడించి మార్కోపోలో వంటి చరిత్రకారుల్ని విస్మయపరిచాయి. నిర్మల్ కత్తులకు డమాస్కస్లో గొప్ప విలువ లభించింది. ఈ కాలంలో ఓరుగల్లు చిత్రవిచిత్రమైన వృత్తులకు పుట్టినిల్లు. మత, సైనిక. విలాస జీవితావసరాల్ని తీర్చేందుకు కొత్త వృత్తులు, ఉపకులాలు పుట్టుకు వచ్చాయి. గృహ నిర్మాణ రంగంలో మేస్త్రీలు, బంగారుపనిలో స్వర్ణకారులు క్షురకర్మలో నాయీ బ్రాహ్మణులు తమ పనితనంతో మహారాష్ట్ర, గుజరాత్ ప్రాంతాలకు విస్తరించారు. కంద కాలు తీయడంలో, కట్టల నిర్మాణంలో నిపుణులైన పాలమూరు వడ్డెరలు ఈ రోజు దేశాన్ని చుట్టివస్తున్నారు. వీరే కాక మత సంబంధమైన, కళా సంబంధమైన వృత్తులో ఉన్నవారు వేల సంఖ్యలో ఉన్నారు. ప్రభుత్వాలు వీరి పని తనాన్ని గుర్తించి తగిన ప్రోత్సాహం అందిస్తే హస్తకళారంగంలో తెలంగాణా తిరిగి ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుంది.

**4. వ్యవసాయం**: తెలంగాణా ప్రజల జీవనాధారం, ముఖ్య వృత్తి వ్యవసాయం. ఇక్కడి ముఖ్యమైన పంట వరి. మెట్టభూములు పుష్కలమైన నీటి ఊట కారణంగా చరిత్ర పూర్వయుగం నుండే ఇక్కడ వ్యవసాయం, పశుపోషణ జరిగిన ఆధారాలు కనిపిస్తాయి. ప్రాజెక్టులు, నదులు, కాలువలు ఉన్న ప్రాంతాలలో వరి అధికంగా పండేది. జొన్నల ఉత్పత్తిలో మహబూబ్నగర్, మెదక్, అదిలాబాద్ జిల్లా లు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. పెసర పంటలో మెదక్ అగ్రస్థానంలో ఉంది. నూనెగింజలు, పొగా కు, ఉల్లి సాగులో మహబూబ్నగర్, పత్తి సాగులో అదిలాబాద్, మొక్కజొన్న ఉత్పత్తిలో

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:9, ISSUE:12(6), December:2020

మహబూబ్నగర్, ఆదిలాబాద్, మెదక్ కరీంనగర్, వరంగల్ జిల్లాలు ప్రసిద్ధి చెందాయి. మిరప పంటలో ఖమ్మం అగ్రస్థానం లో ఉంది. మొత్తం సాగుభూమి విస్తీర్ణంలో భౌగోళికంగా పెద్ద జిల్లా అయిన మహబూబ్నగర్ అగ్రస్థానంలో ఉండగా పూర్తిగా నగర ప్రాంతమైన హైదరాబాద్లో ఎలాంటి సాగుభూమి లేదు. హైదరాబాద్ తోటల గరంగా, గోల్కొండ రాజ్యం రెండవ ఈజిప్టుగా పేరుపొందాయి. సాలార్ జంగ్ వ్యవసాయ సంస్కరణలు చేపట్టి భూములను కౌలుకు ఇచ్చి వ్యాపార పంటలను ప్రోత్సహించారు. కుతుబ్షాహీలు తెలంగాణాలో నాలుగు చెరుగులు చెరువుల్ని తవ్వించారు. పెద్ద చెరువుల్ని సముద్రాలుగా సంభోదించారు. కాకతీయులు పెద్ద ఎత్తున అడవులను నరికించి గ్రామాలను నెలకొల్పారు. ఇక్ష్వాకులు, శాతవాహనులు వేల కొలది పశు వులను, నాగళ్లను దానం చేశారు. అడవులను గ్రామాలుగా నెలకొల్పి గొలుసుకట్టు చెరువుల్ని నిర్మించారు. పర్యవసానంగా వ్యవసాయం తిరిగి పురోగతి సాధించింది.

**5. మత విశ్వాసాలు**: తెలంగాణా ఆధ్యాత్మిక చింతన వైవిధ్యభరితమైంది. మతాన్ని ఎంత ప్రేమించినా మానవత్వాన్ని నిలుపుకోవడంలో ఇక్కడి ప్రజాస్పృహ మెచ్చుకోతగింది. ప్రజల మతం పాలకుల మతంతో విభేదించిన సందర్భాలు చరిత్రలో ఉన్నాయి. ప్రకృతి శక్తుల్ని కొలవడం ద్రావిడ ప్రజల లక్షణం. ఎన్ని మతాలు వచ్చిన ఈ లక్షణం తెలంగాణాలో కొనసాగుతూనే ఉంది. తెలంగాణాలో జైనం విశేషమైన స్థానం సంపాదించి వేములవాడ చాళుక్యుల కాలంలో తారాస్థాయికి చేరింది. కుతుబ్షాహీల గోల్కొండ రాజ్య ఆవిర్భావాలతో తెలంగాణాలోకి ఇస్లాం ప్రవేశించింది. మత సహనాన్ని పాటించిన కుతుబ్షాహీల పరిపాలనలో తెలంగాణా ఉమ్మడి సంస్కృతిని సాధించింది. తెలంగాణా ప్రజలు సూఫీతత్వాన్ని బాగా ఆచరించారు. తెలంగాణా ఉరుసులను, పీర్ల పండు గను తనలో విలీనం చేసేకుంది. నిజాం కాలంలో పరిపాలన పరమైన అవసరాలతో సిక్కులు, క్రైస్తవులు తెలంగాణాకు

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:9, ISSUE:12(6), December:2020

వచ్చారు. తొలినాళ్ళలోనే చర్చిల నిర్మాణం జరిగింది. వైదికజ్ఞానంతో సంబంధంలేని పూజాధి కాలతో సామాన్యపౌరులు, స్త్రీలు పూజారులయి జానపద భక్తిభావనకు విశేష ఆదరణ లభించింది. ఈ కలివిడితో తెలంగాణా ప్రజలకు ఎదుటి మతాన్ని గౌరవించే లక్షణం, మతవిధానంలోనూ చెక్కుచెదరని సంఘ దృక్పథంగా అలవడ్డాయి.

**6. కళలు:** తెలంగాణాలోని అన్నికులాలు తమ వృత్తిపనిలో అద్భుతమైన సృజనాత్మకత, కళాత్మకశక్తిని కలిగి ఉన్నాయి. వాద్య, చిత్ర, శిల్పకళా విన్యాసంతో కూడిన ఆటపాటలలో కులపురాణాలు చెప్పి వినోదింపజేయడం. చిందు ఎల్లమ్మ, మిద్దె రాములు, కాపు రాజయ్య మొ|| కళాకారులు ఈ వారస త్వానికి గతతరం ప్రతినిధిలు. తెలంగాణాలోని పలు ప్రాంతాలు కళలకు ప్రసిద్ధి చెందినవి. ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ కొయ్యబొమ్మలకు పేరుగాంచగా, వరంగల్ జిల్లా పెంబర్తి ఇత్తడి సామానులకి ప్రసిద్ధి చెందింది ఆదిలాబాద్ జిల్లా రంజన్ల తయారీకి ప్రసిద్ధి చెందింది. నారాయణపేట జరీచీరలకి పేరుగాంచింది. ఇలా ఎన్నో కళలకి ప్రసిద్ధి చెందింది తెలంగాణా ప్రాంతం.

**7. పరిశ్రమలు–వాణిజ్యం**: వ్యవసాయరంగంతో పాటూ పారిశ్రామిక, వాణిజ్యరం గాల్లో క్రీ.పూ నాటికే తెలంగాణా గొప్ప కేంద్రంగా ఎదిగినట్టు విదేశీ నాణాలతో పాటూ, పరిశోధనలు నిరూపిస్తున్నాయి. సింధూనాగరికతకు చెందిన కంచుయుగానికి సమాంతరంగా ఇక్కడ లోహయుగం ఆవి ర్భవించిందని, ఆర్యుల రాకకు పూర్వమే ఉత్తర తెలంగాణాలోని 1800 గ్రామాల్లో ఇనుపచిట్టెం ఆనవాళ్ళు కనిపిస్తున్నాయి. బొగ్గుగనులు నాలుగు జిల్లాలకు విస్తరించడం, జిల్లాలో సిమెంటు ఫ్యాక్టరీలు రావడంతో ఉపాధి అవకాశాలు పెరిగాయి. దొరల భూస్వాముల పీడనకు గురైన యువకులంతా బొగ్గుబాయిల్లో కార్మి కులుగా చేరారు. వస్త్ర పరిశ్రమలో మరమగ్గాలు

రావడంతో ఉపాధి వెతుకులాటలో బొంబాయి, షోలాపూర్ లకు వలసలు ఎక్కువ అయ్యాయి. బీడి పరిశ్రమలు గ్రామీణ, పట్టణ స్త్రీలకు ప్రత్యామ్నాయ ఉపాధినిస్తున్నా యి. నీటిపారుదల సౌకర్యం ఉన్న చోట్ల ఇప్పుడిప్పుడే వ్యవసాయాధార చిన్న తరహా పరిశ్రమలు ఏర్పడుతు న్నాయి.

**8. పండుగలు–ఉత్సవాలు**: స్థానికంగా జరుపుకొనే పండుగలు, ఉత్సవాలు ప్రధానంగా శక్తి పూజ, శివారాధన, వ్యవసాయం, కులవృత్తుల నేపథ్యంతో రూపొందాయి. తెలంగాణా ప్రసక్తి రాగానే వెంటనే గుర్తుకు వచ్చేది బతుకమ్మ పండుగ. బతుకమ్మ ఈ ప్రాంతానికి సాంస్కృతిక చిహ్నం. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా మట్టికీ మనిషికీ, పూలకూ–నీటికీ ఉన్న సంబంధాన్ని బతుకమ్మ–బొడ్డెమ్మ పండుగలు ఆవిష్కరిస్తాయి. బతుకమ్మ–బొడ్డెమ్మ నెలరోజుల పండుగ. బొడ్డెమ్మను ప్రతిష్టించింది మొదలు పెద్ద బతుక మ్మను సాగనంపే వరకు గ్రామాలు పండుగ సందడితో పరవసిస్తాయి. బతుకమ్మ పిండి వంటలు మరో ప్రత్యేకాంశం. దీపావళి, నోము, శివరాత్రిజాగారం తెలంగాణాలోని సమస్త కులాలవారు అత్యంత నిష్టతో పాటించే పండుగలు. ఈ రెండు పండుగల ఆచరణలో, పూజా సామగ్రిలో ప్రాంతీయ లక్షణం చెప్పుకోతగిOది. ఆటపాటలతో జరుపుకొనే పండుగ కాముని పున్నమి. బతుకమ్మ, కాముని పండుగ పాటలకు తెలంగాణా సాహిత్యంలో విశిష్ట స్థానం ఉంది. అన్ని కులాలవారు కలసి జరుపుకొనేది పీర్ల పండుగ. అలావాగుండం ఆటపాటలు, చదివింపులు, కాగడా వెలుగులు, మసీదు దిగుళ్ళ నిండా దీపాలు, చిత్రమైన వేషాలు పీర్లపండుగలో ప్రత్యేకతలు.

వివిధ కులాలు విడిగా, ఘనంగా పండుగలు జరుపుకొనే సాంప్రదాయం తెలంగాణా లో ఉంది. వ్యవసాయపరంగా మైసమ్మ. ఉప్పలమ్మల్ని పూజిస్తారు. పోషమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ వంటి

ఉమ్మడి గ్రామ దేవతలకే కాక ఆయా కులాల కులదేవతలకు జరిపే ఉత్సవాలు పెరెన్నికగన్నవి. ఈ దేవతల కు ఊరి శివారులో గుళ్ళు నిర్మించి బోనాలు తీయడం, పట్నాలు వేయడం, సిదొగ్గాలు, జంతుబలి, కథా గాన ప్రదర్శన వంటిది జరపటం ఇక్కడ సర్వసాధారణం. ఇక్కడ ఏకులం వారు పండుగ చేసుకున్నా, కుల దేవత ఉత్సవం తలపెట్టినా దాదాపుగా గ్రామంలోని అన్నీ కులాల తోడ్పాటు తప్పనిసరి. ఇదే ఇక్కడి పండు గల, ఉత్సవాల ప్రత్యేకత. సమిష్టి భావనను, సంఘదృక్పథాన్ని ఈ పండుగల ప్రాధమిక లక్షణం.

ముగింపు: తెలంగాణా సంస్కృతి సాంప్రదాయాలలో ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. బతుకమ్మ పండుగతో ఎంతో ప్రసిద్ధికెక్కింది. ఎందరో మహనీయులు పుట్టిన గడ్డ తెలంగాణా. సాహిత్యం పరంగాకుడా ఎంతో ప్రసిద్ధి చెందింది. 2017 లో జరిగిన ప్రపంచ తెలుగుమహాసభలు తెలంగాణాకు మరెంత వన్నెను చేకూర్చాయి. ఇక్కడి ఆచారా వ్యవహారాలు మిగతా ప్రాంతాలో పోల్చుకుంటి భిన్నంగానే ఉన్నాయని చెప్పవచ్చు. ప్రజల జీవన విధానంలో కుడా ఎంతో వ్యత్యాసం కనిపిస్తుంది. ఒక మహాకవి అన్నట్లు "నా తెలంగాణా కోటి రత్నాల వీణ" ఈ మాట అక్షరాల సత్యం. ఇప్పటికీ తెలంగాణా కోటి రత్నాలతో, మిరమిట్లుకొలిపే కాంతులతో విరాజిల్లుతుంది.

ఉపయుక్త గ్రంథాలు:

1. దిన పత్రికలు ( నమస్తే తెలంగాణ)
2. తెలంగాణ చరిత్ర – సంస్కృతి (తెలుగు విశ్వ విద్యాలయం)
3. తెలంగాణా సాహిత్య ప్రస్థానం ( తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ)